

జనగామ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- భవిష్యత్‌లో ఐటీ కారిడార్.. పరిశ్రమలతో ప్రగతిబావుటా ఎగరేస్తది
- చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తా
- మీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి
- నాడు బచ్చన్నపేట కరువును చూసి ఏడ్చిన
- ఇప్పుడు పచ్చదనం చూసి సంతోషపడుతున్నా..
- జనగామ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

# జనగామ వందశాతం అభివృద్ధి సాధిస్తది

జనగామ/ చేర్యాల, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ) : జనగామను జిల్లాగా ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీ ఇచ్చి విప్లవాత్మక అభివృద్ధికి శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్, సోమవారం జిల్లా కేంద్రంలో కనీవినీ ఎరుగనిరీతిలో నిర్వహించిన జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో మరిన్ని వరాలు కురిపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరిన అన్నింటికీ వెంటనే పచ్చజెండా ఊపారు. 'పల్లా రాజేశ్వర్‌రెడ్డి హుషారుగ ఉంటడని తెలుసని, ఇంత హుషారు అని తెల్వదు.. మీరు సభ పెట్టిపోతే చాలు..గెలిసొచ్చిన తర్వాత అన్నీ అడుగుత అన్నడు..ఈడికి వచ్చిన తర్వాతనేమో 'దొడ్లెకచ్చిన గోద పెండ పెట్టకపోతదా' అన్నట్లు పెద్ద..లిస్టు చదివి ఇవి చేస్తవ..సస్తవా అన్నట్లు చేసిండు..ఈయన కన్న ముత్తిరెడ్డే నయముండె' అంటూ చమత్కరిస్తూనే..'ఎమ్మెల్యే కాకముందే నియోజకవర్గ సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తపన పడే ఇట్లాంటి మంచి నాయకుడు ఉండాలె' అంటూ పల్లాపై కేసీఆర్ ప్రశంసలు కురిపించారు. 'చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా చేయాలన్నది ఆ ప్రాంత ప్రజల కోరిక..అదేం పెద్ద విషయం కాదు.. ప్రభుత్వం ఏర్పడిన నెలలోనే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తూ జీవో విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. జనగామ మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్, పారా మెడికల్ కాలేజీలు వస్తాయని చెప్పారు. అది రాష్ట్రస్థాయి పాలసీలోనే ఉందన్నారు. 'అయినా పెద్ద నీరడే (పల్లా) మీ దగ్గర ఉన్నడు.. జనగామ అభివృద్ధి బాధ్యత నాదే ఎన్నికల తర్వాత ప్రణాళికాబద్ధంగా ముందుకు పోదా'మని భరోసా ఇచ్చారు. సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపిస్తున్నంత సేపూ సభలో జనం చప్పట్లు, కేరింతలతో హోరెత్తించారు. జనగామ సమస్యలు తెలుసుకొని వాటన్నింటి గురించి పల్లా చెప్పారని.. అవన్నీ చేయదగినవేనని, అన్నింటినీ చేసి పెడుతానని స్పష్టం చేశారు. 'చేర్యాలలో ఎన్నికల ముగింపు బహిరంగ సభకు నియోజకవర్గానికి మళ్లీ వస్తా..మీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి పెండింగ్ పనులు, సమస్యలన్నీ పరిష్కరిస్తా'నంటూ హామీ ఇచ్చారు. 'ఒకనాడు బచ్చన్నపేట కరువు చూసి ఏడ్చిన.. ఇప్పుడు హెలికాప్టర్‌లో వస్తుంటే ఎటుచూసినా పచ్చదనం చూసి సంతోషమైంది' అని గుర్తుచేశారు. 'జనగామలో ఒకప్పుడు చాలా భయంకరమైన పరిస్థితి ఉండె.. యాది చేసుకుంటేనే భయపడే పరిస్థితి.. కండ్లకు నీళ్లచ్చే పరిస్థితి ఉండె.. తెలంగాణ ఉద్యమం జరిగేటప్పుడు ఎనిమిది సంవత్సరాలు అన్ని జిల్లాలు..మండలాలు నలుచెరుగులా, మూలమూలలా తిరిగిన.. మీకు తెలుసు.. కండ్లకు నీళ్లు తీసుకొని స్టేజీల మీదనే ఏడ్చిన..అట్లాంటి ప్రదేశాల్లో బచ్చన్నపేట మండలం ఒకటి' అని కేసీఆర్ గుర్తుచేశారు. సిద్దిపేట నుంచి సూర్యాపేటకు పోతూ వయా బచ్చన్నపేట మీదుగా పోతుంటే మండల కేంద్రంలో కొద్దిసేపు ఆగి జీపు ఎక్కి మైక్‌లో మాట్లాడుతుంటే ఎదురుంగ చూస్తే ఒక్కరు కూడా యువకులు లేరని నాటి దృశ్యాలను తలుచుకున్నారు. 'నా ముందు అందరూ వయస్సు అయిపోయిన వారే ఉన్నరు.. ఏమైందని అడిగితే ఎనిదేండ్లు కరువుతో బచ్చన్నపేట చెరువు అడుగంటింది.. బావుల్లో నీళ్లు లేవు.. బోర్లు ఎండిపోయినయ్ ఎనిమిది కిలోమీటర్లు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నం అని ఏడ్చిండ్లు.. నాకు కూడా దుఃఖం ఆగలేదు' అని కేసీఆర్ పేర్కొన్నారు. వారానికోరోజు స్నానం చేయలేని పరిస్థితుల్లో ఆనాడు యువకులు అన్నమో రామచంద్రా అని పొట్టచేత పట్టుకొని వలస పోయిన దుస్థితిని తాను కండ్లారా చూసి వలవలా ఏడ్చానని కేసీఆర్ చెప్పుకొచ్చారు. ఈరోజు చూస్తే తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. 'కొత్త జిల్లాలు ఏర్పాటు చేసేటప్పుడు చాలామంది చాలా మాటలు చెప్పిన్రు. నేను ఒకటే చెప్పిన, హైదరాబాద్ నుంచి వరంగల్ పోయే మార్గంలో ఒకటి లేదా రెండు ఎకనామిక్ గ్రోత్ సెంటర్లు కావాలని కోరితే..ఆర్థిక నిపుణులు వేరే పాయింట్లు సూచిస్తే..నేనే నా పెన్నుపెట్టి ఇది కాదా అని జనగామ, భువనగిరి మీద పాయింట్ పెట్టిన. ఈ రెండు కూడా ఇప్పుడు బ్రహ్మాండమైన గ్రోత్ కారిడార్లు అయినయి' అని ముఖ్యమంత్రి వివరించారు. 'నీళ్లు వచ్చిన తర్వాత పాత వరంగల్ జిల్లాలోనే అత్యధికంగ వడ్లు పండించే తాలుకాగా ఇయ్యాల జనగామ తయారైంది. నేను అప్పుడప్పుడు తెలుసుకుంటున్న బచ్చన్నపేట చెరువు సంగతేమైందని. నేను అప్పడప్పుడు అడుగుతున్న..ఆనాడు ఎండింది కానీ ఇప్పుడు 365 రోజులు నిండే ఉంటాంది.. ఇప్పుడు ఎండిపోయే ప్రశ్నేలేదని అధికారులు చెప్పిండ్రు. మా ముత్తిరెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు చెబుతుంటే సంబురం అనిపించింది' అంటూ వివరించారు. 'జనగామ ఎంత కరువు ప్రాంతం ఉండెనో..ఎన్ని మంచినీళ్లు అమ్ముకునే దుకాణాలు ఉండెనో అవన్నీ మాయమై చాలా చక్కగా అభివృద్ధి చెందుతున్నది' అని కేసీఆర్ చెప్పారు. హైదరాబాద్ సమీప ప్రాంతం కాబట్టి జనగామ వందశాతం అభివృద్ధి చెంది తీరుతుందని, సిటీ పొలిమేర ఉప్పల్, ఘట్‌కేసర్ దాటిన తర్వాత జనగామ 50, 60 కిలోమీటర్ల దూరంలోనే ఉంది కాబట్టి భవిష్యత్‌లో ఐటీ కారిడార్, పరిశ్రమలతో చాలా అద్భుతంగా మారుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, నాగపురి రాజలింగం, జనగామ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, సుంకరి మల్లేశం, మున్సిపల్ చైర్మన్ పోకల జమున లింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, ఎంపీపీలు మేకల కలింగరాజు, గోవర్ధన్, నాగజ్యోతి, హరిత, జడ్పీటీసీలు పద్మజ, శ్రీనివాస్, దీపిక, ముదిరాజ్ మహాసభ జిల్లా మహిళ అధ్యక్షురాలు చినబోయిన రేఖ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతా రెడ్డి, సర్పంచులు, ఎంపీటీల ఫోరం అధ్యక్షులు బొల్లం శారద, బండ లక్ష్మి, గంగం సతీష్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





బహిరంగ సభావేదికపై మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

## పొన్నాలకు కేసీఆర్ సాదర స్వాగతం

- బీఆర్ఎస్‌లో చేరిన టీ-పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య
- గులాబీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న అధినేత కేసీఆర్
- ఇద్దరు బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్లు సహా 16 మంది కాంగ్రెస్ ముఖ్యనేతలు బీఆర్ఎస్‌లోకి
- ఎన్నికల వేళ జనగామలో గులాబీ జోష్

జనగామ/చేర్యాల, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): టీ-పీసీసీ తొలి అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సోమవారం జనగామ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్ నుంచి సీఎం కేసీఆర్ వెంట హెలికాప్టర్‌లో వచ్చిన పొన్నాలను సభా వేదికపై పక్కనే కూర్చోబెట్టుకొని తొలుత గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. జనగామ మున్సిపల్ బీజేపీ ఫ్లోర్‌లీడర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మరో బీజేపీ కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు సీహెచ్ రాజమౌళి, జనగామ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, సీనియర్ నాయకులు, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇక్బాల్, నర్మెట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిటి అంజయ్య, జనగామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ మాజీద్, కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగె గురువయ్యగౌడ్, నర్మెట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, వెల్దండ సర్పంచ్ నర్ర రమణారెడ్డి, జనగామ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎర్రమల్ల లక్ష్మణ్, చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్, చేర్యాల మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు, దానంపల్లి సర్పంచ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, చేర్యాల మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు కుర్రపాటి మధు, కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సల్తాన్ గోవింద్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరాబు మధు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు సౌడ మహేశ్, జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రావుల రాజేశ్‌గౌడ్‌ను పొన్నాల లక్ష్మయ్యతోపాటు సీఎం కేసీఆర్ స్వయంగా గులాబీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

## తెలంగాణ ఐకాన్.. కేసీఆర్

**ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి**



తెలంగాణ అంటేనే కేసీఆర్.. కేసీఆర్ అంటేనే తెలంగాణ అని జనగామ ఎమ్మెల్యే, టీఎస్ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. జనగామ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఢిల్లీలో తెలంగాణ అంటే అదెక్కడుంటుంది అనే వాళ్లని.. కేసీఆర్ రాష్ట్రం సాధించిన తర్వాత పరిపాలన దక్షతతో దేశానికే ఐకాన్‌గా తెలంగాణను మార్చారని పేర్కొన్నారు. ఒకనాడు బువ్వకు నోచుకోని.. జ్వరం వస్తేనో.. జేజమ్మకు పెడితేనో తెల్లటి మెతుకులు దొరికేవి కానీ ఇప్పుడు భారతదేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. జనగామ జిల్లా ఇచ్చి జిల్లా ఆకృతి తెచ్చి, మెడికల్ కాలేజీ మంజూరు చేసి నిండుగా నీళ్లు ఇచ్చిన ఫలితంగానే ఈ ప్రాంతం సస్యశ్యామలమైందని పేర్కొన్నారు. నాటి జనగామ ఎట్లుండె.. నేడు ఎలా మారిందో మీ కండ్ల ముందున్నదని అని చెప్పారు. రాష్ట్రాధినేత, కాబోయే దేశాధినేతను ఆశీర్వదించేందుకు అశేషంగా తరలివచ్చిన ప్రజలకు ముత్తిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జై తెలంగాణ.. కేసీఆర్ నాయకత్వం.. కేటీఆర్ నాయకత్వం.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఎమ్మెల్యే నినాదాలు చేశారు.

## జనగామకు పెద్ద పాలేరుగా పనిచేస్తా..

**పట్టణానికి మంచినీళ్లే తొలి ఎజెండా : బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

జనగామ/ చేర్యాల, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): కేసీఆర్ సార్ దీవించి పంపిన తనకు పెద్దన్నలాగా ముత్తిరెడ్డి అండ ఉన్నదని.. ప్రజలు ఆశీర్వదిస్తే పెద్దఎత్తున నిధులు తెచ్చి జనగామ నియోజకవర్గానికి పెద్ద పాలేరుగా పనిచేస్తానని జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మీ అందరి ముందు వాగ్దానం చేస్తున్నా సీఎం కేసీఆర్ వద్ద నుంచి అవసరమైన నిధులు తెచ్చి స్వచ్ఛమైన తాగునీటిని పట్టణ ప్రజలకు అందించడమే తొలి ఎజెండాగా పెట్టుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ తన మీద నమ్మకంతో జనగామ అభ్యర్థిగా వెళ్లమన్నప్పుడు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు వెళ్తే అందరూ ఆశీర్వదిస్తున్నారని, ఈ ప్రేమ, అభిమానం, నమ్మకం, విశ్వాసం తన మీద కాదు.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌పైన అని తెలుసునన్నారు. నా ముఖం తెలియకపోయినా ప్రేమతో, ఆప్యాయతతో స్వీకరిస్తున్నందుకు మీ అందరికీ చేతులెత్తి, శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. జనగామ జిల్లా ఇచ్చారు.. ఇక్కడికి రైతులకు సాగునీరు ఇచ్చారు.. మెడికల్ కాలేజీ ఇచ్చారు.. ఇంకా ఏం కావాలో సీఎం కేసీఆర్‌కు తెలుసన్నారు. చాలామంది కేసీఆర్ సిద్దిపేట నుంచి సూర్యాపేట బయలుదేరారని తెలిస్తే వేలమంది ఉసిల్లపుట్టలాగా వచ్చి ఆయన వెంట నడిచేవాళ్లు అని గుర్తుచేశారు. పోరాటాల గడ్డ జనగామ.. తెలంగాణ సాయుధ పోరాటం, నక్సల్బరి ఉద్యమం, తొలి, మలిదశ పోరాటంలో ముందున్న ప్రాంతం.. కేసీఆర్ గులాబీ జెండా ఎత్తిన నాడు కూడా సిద్దిపేటకు ఆనుకొని ఉన్న జనగామ మీ వెంట నడిచిందని పల్లా గుర్తుచేశారు. జనగామ, చేర్యాల ప్రాంతం కలిపి నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత సిద్దిపేట, గజ్వేల్‌లో ఈ ప్రాంతం ఒదిగినట్లు ఉంటదని చెప్పారు. భౌగోళికంగా, మానసికంగా జనగామ ప్రాంతం మీకు ఒదిగి ఉంటుందని.. ఈ



ప్రాంతానికి ఏం కావాలో కేసీఆర్‌కు బాగా తెలుసన్నారు. జనగామ నియోజకవర్గానికి కావాల్సిన సాగునీటిని మల్లన్నసాగర్, తపాస్‌పల్లి, బొమ్మకూరు ద్వారా ఇస్తున్నారని, ఎక్కడైతే పంట కాల్వలు, చెక్‌డ్యాంలు, మినీ లిఫ్టులు కావాలో వాటన్నింటినీ ఇవ్వాలని జనగామ ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నానని కోరారు. జనగామకు మెడికల్ ఇచ్చారని దానితో పాటు నర్సింగ్ కాలేజీ, పారా మెడికల్ కాలేజీ, పాలిటెక్నిక్, వెటర్నరీ కాలేజీ ఇవ్వాలని కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. జనగామలో నీళ్లు వస్తున్నవి కానీ వాటిని మంచినీళ్లుగా భావించి ఎవరూ తాగడం లేదని.. చీటకోడూరు రిజర్వాయర్‌ను బాగుచేసుకోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. బాగా అభివృద్ధి చెందుతున్న జనగామకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రంగప్ప చెరువు అభివృద్ధి, ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్, డీసీపీ ఆఫీస్, స్పోర్ట్స్ స్టేడియం, కళాభవనం కావాలని.. బచ్చన్నపేట, చేర్యాల, నర్మెటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ కావాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. జనగామ ప్రాంతంలో అత్యధికంగా పాల ఉత్పత్తి, రికార్డుస్థాయిలో వరి ధాన్యం పండే ప్రాంతం జనగామ అని, పామాయిల్ పంటలు కూడా బాగా వేస్తున్నారని, సీతాఫలాలు, చింతగింజలు ఎక్కువ లభించే జనగామలో యువత కోసం గ్రోత్ సెంటర్‌లో సెంటర్‌లో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, ధూళ్మిట్ట మండలాలను కలిపి చిన్నదైనా సరే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చేర్యాలలో ఫైర్‌స్టేషన్, మినీస్టేడియం, పట్టణాభివృద్ధి, పెద్ద చెరువు, కొమురవెల్లి మల్లన్న చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. గజ్వేల్, సిద్దిపేట అభివృద్ధిని చూసిన జనగామ ప్రజలు వాటిలాగా తమ జిల్లా కూడా కావాలని ఆశిస్తున్నారని, వారి అభీష్టం మేరకు తీర్చిదిద్దాలని పల్లా కోరారు.